నవభూమి

కరీంనగర్

అనుబంధం

16 సెప్టెంబర్,2024 సోమవారం పేజీలు:3

www.epaper.navabhoomi.in






# విద్యారంగ సమస్యలపై ఉద్యమం




**సుభాష్‌నగర్, –నవభూమి:** విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం సమరశీల ఉద్యమాలు చేపడుతామని యునైటెడ్ స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (యూఎస్ఎఫ్ఐ) రాష్ట్ర అధ్యక్షుడు తాటికొండ రవి, మాదం తిరుపతి పేర్కొన్నారు. శనివారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నూతన జాతీయ విద్యావిధానం పేరుతో ఉమ్మడి జాబితాలో ఉన్న విద్యను కేంద్రీకరణ చేయాలని కుట్ర చేస్తోందని అన్నారు. దీనిని తిప్పి కొట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. విద్యారంగంలో ప్రజాస్వామ్య విలువలను ప్రభుత్వాలు కాపాడాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం విద్యను మార్కెట్ శక్తులకు కట్టబెట్టే కుట్ర చేస్తోందన్నారు. బీజేపీ ప్రభుత్వం పరీక్షల నిర్వహణలో విఫలం అయ్యిందని అన్నారు. తక్షణమే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో విద్యారంగం తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటోందన్నారు. గత ప్రభుత్వం విద్యారంగాన్ని పూర్తిగా విస్మరించడం వల్ల ప్రభుత్వ విద్యారంగం సమస్యలతో కొట్టుమిట్టాడుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు గడుస్తున్నా గత పాలకుల లాగానే వ్యవహరిస్తుందన్నారు. యూనివర్సిటీలకు రెగ్యులర్ వీసీలను నియమించకుండా ఇన్‌చార్జి వీసీలను నియమిస్తోందన్నారు. డిగ్రీ, జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయిం బర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సంక్షేమ గురుకుల పాఠశాలల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, అద్దె భవనాల్లో కొనసాగుతున్న సంక్షేమ హాస్టల్స్, గురుకులాలకు పక్కా భవనాలను నిర్మించాలని, విద్యార్థినిలపై దాడులను అరికట్టేందుకు చట్టాలను కఠినంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు ఉప్పుల రాహుల్, కార్యదర్శి సంద గణేష్, ఉపాధ్యక్షుడు మాలోతు రాకేష్ నాయక్, రాష్ట్ర కమిటీ సభ్యుడు కుమార్, ఉమామహేశ్వర్, హరీష్, గణేష్, మణి, రామ్, కీర్తన, నీలిమ, అభిలాష్, సతీష్, స్పందన, సింధు తదితరులు పాల్గొన్నారు.




# మీ మనసులు గెలుచుకునేందుకే వచ్చా

**పెద్దపల్లి, –నవభూమి:** పెద్దపల్లిలో నిర్వహించిన సభకు హాజరైన ప్రజలు ‘మీరు కోరుకునే అభివృద్ధి, మీ పంట పొలాలకు సాగు నీరందించే పథకాలకు కార్యరూపం ఇచ్చి, మీ మనసులను గెలుచుకునేందుకే ఇక్కడికి వచ్చా.. పాదయాత్ర చేసిన సమయంలో మీరు చూపిన ఆదరణ మరిచిపోలేని అనుభూతిని ఇచ్చిందని’ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ధర్మారం, జూలపల్లి, పెద్దపల్లి మండలాల్లో పలు అభివృద్ధి పనులకు భూమిపూజ నిర్వహించిన అనంతరం ధర్మారం వ్యవసాయ మార్కెట్‌లో ధర్మారం, గొల్లపల్లి, వెల్గటూరు వ్యవసాయ మార్కెట్ల పాలకవర్గాల ప్రమాణస్వీకారోత్సవ బహిరంగ సభ, పెద్దపల్లి జెండాకూడలిలో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ఇక్కడి ప్రజల భావోద్వేగాలతో ముడిపడిన పత్తిపాక జలాశయాన్ని నిర్మించేందుకు బడ్జెట్‌లో రూ.10వేల కోట్లను కేటాయించినట్లు చెప్పారు. పెద్దపల్లి మండలంలో ఒకేరోజు రూ.85 కోట్ల అభివృద్ధి పనులను ప్రారంభించినట్లు చెప్పారు. ఎల్లంపల్లి ఎత్తిపోతల కోసం మరో ఉపకేంద్రాన్ని సైతం మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ధర్మారం మండలంలోని మేడారం, జూలపల్లి మండలం కాచాపూర్‌లో మహిళా సంఘాల ఆధ్వర్యంలో సోలార్ విద్యుత్తు ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఓదెల మండలం రూప్‌నారాయణపేట వద్ద మానేరుపై వంతెన నిర్మాణం చేపడతామని చెప్పారు. ధర్మారంలో పత్తిపాక రిజర్వాయర్ నిర్మాణ అంశాన్ని బడ్జెట్‌లో పొందుపరిచి త్వరలో ప్రాజెక్టు సర్వే చేసి నిర్మాణం చేపడతామని తెలిపారు. బండ్ల వాగు, పాలకుర్తి– ఎల్లంపల్లిల మధ్య ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేసేందుకు విద్యుత్తు ఉపకేంద్రం మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ధర్మారం మండలం నందిమేడారం, జూలపల్లి మండలం కాచాపూర్ గ్రామాల్లో రాష్ట్ర ప్రభుత్వ ఖర్చుతో సోలార్ విదుత్తు ఉత్పత్తి యూనిట్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. ఇద్దరు భారాస ఎమ్మెల్యేలు గొడవపడితే..ఆపార్టీ నేతలు కాంగ్రెస్‌ను విమర్శించడం సరికాదన్నారు. ఎన్నికల్లో ఇక్కడి ప్రజలకు హామీ ఇచ్చిన విధంగా ధర్మపురిలో రెసిడెన్షియల్ స్కూల్, ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాల, పెద్దపల్లి, సుల్తానాబాద్ పట్టణాలకు బైపాస్ రోడ్డు, పెద్దపల్లిలో ఆర్టీసీ డిపో ఏర్పాటును సాకారం చేస్తామన్నారు. నియోజకవర్గంలో ఇళ్లులేని అర్హులైన పేదలందరికీ త్వరలో 3,500 రెండు పడకగదుల ఇళ్లను కేటాయిస్తామన్నారు. పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ మాట్లాడుతూ... రెండు పర్యాయాలు పరిపాలించిన భారాస ప్రభుత్వం ఎల్లంపల్లి నిర్వాసితులకు పరిహారం చెల్లించడంలో విఫలమైందన్నారు. వెల్గటూరు మండలానికి చెందిన నిర్వాసితులకు పరిహారం చెల్లించి భూములు, ఇళ్లు కోల్పోయిన వారికి కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయం చేసిందన్నారు. ఈ సందర్భంగా ధర్మారం మార్కెట్‌యార్డులో ధర్మారం, వెల్గటూరు, గొల్లపల్లి ఏఎంసీ ఛైర్మన్లుగా లావుడ్యా రూప్లానాయక్, గుండాటి గోపిక, బీమ సంతోష్, వైస్‌ఛైర్మన్లు, డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం చేశారు. రూ.5 కోట్లతో నందిమేడారం, కటికెనపల్లి గ్రామాల్లో, రూ.25.89 కోట్లతో జూలపల్లి మండలం కాచాపూర్, పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ, రంగాపూర్, పెద్దపల్లి సర్కిల్ కేంద్రాలకు విద్యుత్తు ఉప కేంద్రాలకు ఉపముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. అమృత్ పథకం నిధుల కింద రూ.55.60 కోట్లతో 36 వార్డుల్లో 2,400 నీటిట్యాంకుల నిర్మాణం, 500 సంపులు, 30.46 కిలోమీటర్ల మేర మంచినీటి పైప్‌లైన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రాష్ట్ర పట్టణ ఆర్థిక, మౌలిక వసతుల(టీయుఎఫ్ఐడీసీ) పథకం నిధుల కింద 10 ప్యాకేజీల ద్వారా రూ.30 కోట్లతో సీసీ రోడ్లు, కాలువలు, వీధి దీపాలకు శంకుస్థాపన చేశారు. రూ.23లక్షలతో ‘టాస్క్’కార్యాలయాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్, సుడా ఛైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, శాసనసభ్యులు విజయరమణారావు, మక్కాన్‌సింగ్, అదనపు కలెక్టర్లు అరుణశ్రీ, శ్యాంప్రసాద్‌లాల్, ఆర్డీవోలు గంగయ్య, హనుమానాయక్‌లు పాల్గొన్నారు.ఆర్డీవో కార్యాలయంలో ఒకే చోట వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఉపముఖ్యమంత్రి భట్టి చిత్రంలో మంత్రి శ్రీధర్‌బాబు, ఎంపీ వంశీకృష్ణ, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్,ఎమ్మెల్యేలు విజయరమణరావు, మక్కాన్‌సింగ్, తదితరులు ధర్మపురి నియోజకవర్గంలో ఒక ఐటీఐ, పాలిటెక్నిక్ కళాశాల మంజూరు చేయాలని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఉపముఖ్యమంత్రిని కోరారు. పత్తిపాక జలాశయానికి బడ్జెట్‌లో ఆమోదం తెలిపినందుకు కృతజ్ఞతలు తెలిపారు. చామనపల్లి ముంపు సమస్య పరిష్కరించాలని, బొమ్మారెడ్డిపల్లి–కొత్తపల్లి కాలువకు రూ.7 కోట్లు మంజూరుచేయాలని కోరారు. వెల్గటూరు మండల నిర్వాసితులకు మరో రూ.8 కోట్లు మంజూరు చేస్తే సమస్య పూర్తిగా పరిష్కారం అవుతుందన్నారు. పెద్దపల్లి, సుల్తానాబాద్ పట్టణాలను సమీపంలోని ముఖ్య గ్రామాలతో అనుసంధానిస్తూ బైపాస్ రహదారుల నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆమోదం తెలిపారని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు అన్నారు. ఓదెల మండలంలో మానేరు నదిపై





వంతెన నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామని...త్వరలో నిర్మాణ పనులు ప్రారంభిస్తామన్నారు. పెద్దపల్లి – జమ్మికుంటకు వెళ్లేందుకు వయా పొత్కపల్లిలో రహదారి వంతెనలు నిర్మించాలని ఉపముఖ్యమంత్రిని కోరారు. సుల్తానాబాద్‌లో 10 ఎకరాల్లో ఐటీ టవర్, పెద్దపల్లి నియోజకవర్గానికి ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలను మంజూరు చేయాలన్నారు.

## ఉపాధ్యాయుల బదిలీ.. విద్యార్థుల భావోద్వేగం



**శంకరపట్నం, –నవభూమి:** కరీంనగర్ జిల్లా కేశవపట్నం ఆదర్శ పాఠశాలలో పని చేస్తున్న ప్రిన్సిపల్ జ్యోతితోపాటు 17 మంది ఉపాధ్యాయులు వివిధ ప్రాంతాలకు బదిలీ అయ్యారు. విషయం తెలిసి సెలవు దినం అయినప్పటికీ విద్యార్థులతోపాటు పూర్వ విద్యార్థులు శనివారం పాఠశాలకు తరలి వచ్చారు. పాఠశాలలో 11 ఏళ్లు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు ఒక్కసారిగా బదిలీ కావటంతో భావోద్వేగానికి లోనయ్యారు. అధికారులకు విజ్ఞప్తి చేస్తామని ఇక్కడే ఉండాలని రోదించారు. వారిని ఉపాధ్యాయులు సముదాయించారు. అనంతరం విద్యార్థులు వారికి పాదాభివందనం చేసి, సన్మానించి వీడ్కోలు పలికారు.

## నిమజ్జనానికి దారులు

**కరీంనగర్ –నవభూమి:** గణేష్ నవరాత్రుల ఉత్సవాలు జిల్లాలో ఘనంగా జరుగుతున్నాయి. ఈనెల 16న విగ్రహాల నిమజ్జనానికి అధికార యంత్రాంగం సైతం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. జిల్లా వ్యాప్తంగా ఉన్న 2,931 విగ్రహాలను పోలీసు అధికారులు జియో ట్యాగింగ్ ద్వారా గుర్తించారు. భారీ విగ్రహాలు అధికంగా కరీంనగర్ అర్బన్ పరిధిలోనే ఉన్నాయి. ముఖ్య ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయనున్నారు. కరీంనగర్ అర్బన్ పరిధిలో 513 విగ్రహాలను ఏర్పాటు చేయగా, 8 అడుగుల పైబడినవి 418 ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. భారీ విగ్రహాలను మానకొండూర్‌లో, చిన్న వాటిని కొత్తపల్లి చెరువు, చింతకుంట కాలువలో నిమజ్జనం చేసేందుకు అధికారులు ప్రణాళిక రూపొందించారు. తెలంగాణచౌక్, కోర్టు చౌరస్తా, సుభాష్‌నగర్ నుంచి బొమ్మకల్ బైపాస్ మార్గం వైపు ఉన్న అన్ని విగ్రహాలు టవర్‌సర్కిల్ వరకు తరలిస్తుంటారు. కోర్టుచౌరస్తా నుంచి కొత్తపల్లి వైపు ఉన్న వాటిని అక్కడి చెరువు వైపు, తెలంగాణచౌక్ నుంచి మానేరు జలాశయం బైపాస్ రోడ్డు, రాంనగర్, విద్యానగర్ వైపు ఉన్న వాటిని చింతకుంట కాలువ వైపు తరలించనున్నారు. పోలీసు శాఖ అన్ని విగ్రహాలను జియో ట్యాగింగ్ ద్వారా గుర్తించి నంబర్లు కేటాయించి.. మార్గాలు ఖరారు చేసింది. గ్రామీణ ప్రాంతంలో విగ్రహాలను చెరువులు, కుంటలు, కాలువల్లో నిమజ్జనం చేయాలని పోలీసు, పురపాలిక, రెవెన్యూ శాఖల అధికారులు ఆదేశించారు. 600 మంది బందోబస్తు..సోమవారం రాత్రి 7 గంటల నుంచి మరుసటి రోజు తెల్లవాజాము వరకు విగ్రహాల నిమజ్జనం జరుగుతుంది. నగరం నుంచి శోభాయాత్ర ఉండటంతో టౌన్ ఏసీపీ ఆధ్వర్యంలో మొత్తం అదనపు డీసీపీ ఆధ్వర్యంలో పర్యవేక్షణ కొనసాగనుంది. అయిదుగురు ఏసీపీలు, 12 మంది ఇన్‌స్పెక్టర్లు, 20 మంది ఎస్సైలు, 500 మంది ఇతర పోలీసు సిబ్బంది భద్రతను పర్యవేక్షించనున్నారు. కొత్తపల్లి చెరువు వద్ద 38 మంది, చింతకుంట కాలువ వద్ద 25 మంది పోలీసులు ఉంటారు. ముఖ్య ప్రాంతాల్లో ఏసీపీ, ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారులు బందోబస్తును పర్యవేక్షిస్తారు. రద్దీ ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాలను వినియోగించనున్నారు. టవర్‌సర్కిల్, తెలంగాణచౌక్, కమాన్, పాతబజార్, మంకమ్మతోట, కోర్టు చౌరస్తాలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను కమిషనరేట్ నుంచి పర్యవేక్షిస్తారు. సున్నిత ప్రాంతాల్లో ఇప్పటికే పోలీసులు గస్తీ నిర్వహించారు. నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని కరీంనగర్ టౌన్ ఏసీపీ జి.నరేందర్ తెలిపారు. డీజేల వినియోగం నిషేధం నిమజ్జనం సందర్భంగా వాహనాలకు డీజే సౌండ్ బాక్సుల వినియోగం నిషేధిస్తున్నట్లు కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మహంతి ప్రకటనలో తెలిపారు. సోమవారం నిర్వహించే శోభాయాత్రలో బాణాసంచా పేల్చవద్దని హెచ్చరించారు. రూట్ మ్యాప్ అనుసరిస్తూ విగ్రహాలను నిమజ్జనాకి తరలించాలన్నారు. అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు శాఖ పటిష్ట బందోబస్తును కొనసాగిస్తుందన్నారు. యాత్రలో ఎవరూ ఆయుధాలు ప్రదర్శించవద్దన్నారు.



# ఆక్రమణలపై ఆరా..

◆ ముందు హద్దుల నిర్ణయం,తర్వాత ఉక్కుపాదం!ముమ్మరంగా మూలవాగు బఫర్‌జోన్ సర్వే



**వేములవాడ –నవభూమి:** మూలవాగు ప్రాంతంలో సర్వే చేస్తున్న అధికారులు ఆధ్యాత్మిక పట్టణమైన వేములవాడలోని మూలవాగు పరివాహక ప్రాంతంలో రెండు రోజులుగా మూలవాగు బఫర్‌జోన్ సర్వే పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. మూలవాగు పరివాహక ప్రాంతంలో ఏ మేరకు బఫర్ జోన్ ఉందనేది గుర్తించిన అనంతరం హద్దులు ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుతం నీటిపారుదల, రెవెన్యూ, సర్వే విభాగం అధికారులు సర్వే పనుల్లో నిమగ్నమయ్యారు. పట్టణంలోని మొదటి బైపాస్ రోడ్డులోని మహాలక్ష్మి వీధి ప్రాంతం నుంచి మూలవాగు వంతెన వరకు అక్కడి నుంచి రెండో బైపాస్ రోడ్డులోని బతుకమ్మ స్థలం నుంచి మాజీ ఎమ్మెల్యే ఇంటి పరివాహక ప్రాంతం మీదుగా పట్టణ పరిధిలోని మూలవాగు మొత్తం సర్వే చేసి హద్దులు నిర్ణయించనున్నారు. గతంలో బఫర్ జోన్‌ను గుర్తించి మార్కింగ్ ఇచ్చిన అధికారులు చర్యలు చేపట్టకపోవడం తీవ్ర విమర్శలకు తావిచ్చింది. వివిధ ఒత్తిళ్లతో అధికారులు వెనుకంజ వేశారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. ప్రస్తుతం బఫర్ జోన్‌ను సర్వే చేస్తున్న అధికారులు ఈ సారైనా మూలవాగు పరివాహక ప్రాంతంలోని బఫర్ జోన్ ఆక్రమణలను పూర్తి స్థాయిలో తొలగింపునకు చర్యలు తీసుకొని ప్రభుత్వ స్థలాలను రక్షించి ప్రజోపయోగ అవసరాలకు వినియోగించాల్సిన అవసరం ఉందని పట్టణ ప్రజలు కోరుతున్నారు. ఇష్టారాజ్యంగా నిర్మాణాలు మూలవాగు వెంబడి ఉన్న స్థలాల యజమానులు ఇష్టారాజ్యంగా బఫర్ జోన్ స్థలాన్ని ఆక్రమించి భారీ భవనాలను నిర్మించారు. స్థలాలను ఆక్రమించి మట్టి నింపి భవనాలు నిర్మించినప్పటికీ మున్సిపల్, రెవెన్యూ, నీటిపారుదల శాఖల అధికారులు ఎవరూ పట్టించుకోలేదు. దీంతో మొదటి, రెండో బైపాస్ రహదారి మూలవాగు పరివాహక ప్రాంతంలోని బఫర్ జోన్ పూర్తిగా ఆక్రమణకు గురైంది. మూలవాగు వెంబడి గుంట స్థలం ఉంటే మరో గుంట వరకు ఆక్రమించి నిర్మాణాలు చేశారు. గతంలో మొదటి బైపాస్ రహదారిలో రెవెన్యూ, మున్సిపల్, సర్వే అధికారులు సర్వే చేశారు. బఫర్ జోన్ 9 మీటర్లను గుర్తించి దాదాపు 40 భవనాలకు మార్కింగ్ ఇచ్చి కొన్నింటిని పాక్షికంగా తొలగించారు. కొంత మంది భవనాల యజమానులు కోర్టుకు వెళ్లడంతో పూర్తి స్థాయిలో తొలగింపు చర్యలు చేపట్టలేదు. ప్రస్తుతం బఫర్ జోన్ సర్వే కొనసాగుతుండటంతో హైదరాబాద్‌లోని హైడ్రా తరహాలో ఆక్రమణలు తొలగించేందుకు ఇక్కడ కూడా చర్యలు చేపట్టనున్నట్లు పట్టణంలో చర్చ జరుగుతోంది. ప్రభుత్వ ఆదేశం మేరకు చర్యలు వేములవాడ పట్టణంలోని మూలవాగు వెంబడి బఫర్ జోన్ గుర్తింపునకు సర్వే జరుగుతోంది. వాగుకు ఇరువైపుల తొమ్మిది మీటర్ల చొప్పున బఫర్‌జోన్ స్థలం ఉండాలి. సర్వే చేసి ముందుగా హద్దులు నిర్ణయిస్తాం. నివేదికను ప్రభుత్వానికి అందజేసిన తరువాత ప్రభుత్వ ఆదేశాల మేరకు తదుపరి చర్యలు చేపడతాం.


## సమగ్ర సమాచారం...

# ప్రగతికి ప్రామాణికం

**పెద్దపల్లి –నవభూమి:** పాఠశాలల్లో సమగ్ర సమాచారం సేకరించేందుకు కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ చర్యలు చేపట్టింది. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఏకీకృత జిల్లా విద్యా సమాచార వ్యవస్థ (యుడైస్ ప్లస్) సర్వే శిక్షణ పూర్తయింది. ప్రధానోపాధ్యాయులు ఆన్‌లైన్‌లో బడుల సమగ్ర వివరాలు నిక్షిప్తం చేస్తున్నారు. ఈనెల 20లోపు మండల స్థాయిలో పూర్తి చేసి జిల్లా స్థాయిలో మరోసారి పునఃపరిశీలిస్తారు. తప్పొప్పులు సరి చేసి రాష్ట్ర విద్యాశాఖకు నివేదించనున్నారు. ఈ సర్వే ఆధారంగా ప్రభుత్వ బడుల్లో మౌలిక వసతులకు కేంద్రం నిధులు కేటాయిస్తుంది. ప్రైవేటు పాఠశాలల్లో వసతులపై సమగ్ర సమాచారం అందుబాటులో ఉంటుంది. మూడు అంశాలపై 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి యుడైస్‌ప్లస్ సర్వే మూడు అంశాలుగా నమోదు చేస్తున్నారు. బడుల్లో అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు, క్రీడాస్థలాలు, వంట గదులు, తాగునీరు, శౌచాలయాలు, ఇతర మౌలిక సదుపాయాల వివరాలు నమోదవుతున్నాయి. రెండోది ఉపాధ్యాయులు, మూడోది విద్యార్థుల సమగ్ర వివరాలు, హాజరు, మధ్యాహ్న భోజనం అమలు, పాఠ్య పుస్తకాలు, ఏకరూప దుస్తులు నిక్షిప్తమవుతున్నాయి. ఆన్‌లైన్ సర్వే ఆధారంగా కేంద్రం నిధులు విడుదల చేయనుంది. ప్రగతి పాయింట్లు సైతం కేటాయించనున్నారు. ఆన్‌లైన్‌లో నిక్షిప్తం పాఠశాల స్థాయిలో అత్యంత కీలక సమాచారాన్ని సేకరిస్తున్నారు. ప్రత్యేక యాప్‌లో ప్రధానోపాధ్యాయులు పాఠశాలల్లో వసతులు పరిశీలించి ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేస్తున్నారు. పొరపాట్లకు తావు లేకుండా నమోదు చేసేందుకు జిల్లా ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తున్నారు. ఈనెల 20లోపు అన్ని పాఠశాలల్లో సర్వే పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నారు. ప్రతి అంశాన్ని నిశితంగా పరిశీలించి నమోదు చేస్తేనే బడుల అభివృద్ధి జరగనుంది. కొన్ని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు సక్రమంగా వివరాలు నమోదు చేయడంలేదనే ఆరోపణలు ఉన్నాయి. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు: 535 ప్రైవేటు పాఠశాలలు: 235 మొత్తం విద్యార్థులు: 98 వేలు ప్రభుత్వ ఉపాధ్యాయులు: 2,202 పక్కాగా నమోదు జిల్లాలో యుడైస్‌ప్లస్ నమోదుపై శిక్షణ ఇచ్చాం. పాఠశాలల్లో మౌలిక వసతులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల వివరాలను ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేస్తున్నారు. నిర్ణీత వ్యవధిలోగా పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నాం.



## బృహత్ ప్రణాళికపై కదలిక



**కొండగట్టు –నవభూమి:** కొండగట్టు అంజన్న ఆలయ పరిసరాలు రాష్ట్రంలోనే ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా విలసిల్లుతున్న కొండగట్టు ఆంజనేయస్వామి క్షేత్రంలో బృహత్ ప్రణాళిక అమలుకు అధికారులు నిర్ణయించారు. జగిత్యాల జిల్లా మల్యాల మండలం ముత్యంపేట పరిధిలోని కొండగట్టు అంజన్న ఆలయ పరిధిలో మాస్టర్‌ప్లాన్ అమలు చేయాలని దాదాపు 25 ఏళ్లుగా అధికారులు, నాయకులు ప్రతిపాదనలు చేస్తున్నా అమలుకు నోచుకోవడం లేదు. శుక్రవారం హైదరాబాద్‌లోని దేవాదాయశాఖ ప్రధాన కార్యాలయంలో దేవాదాయ కమిషనరు ఆదేశాల మేరకు మాస్టర్‌ప్లాన్ కమిటీ ప్రప్రథమంగా సమావేశం కావడంతో మొదటి అడుగు పడినట్లయింది. కమిటీలో హైదరాబాద్ దేవాదాయ ధర్మాదాయశాఖ చీఫ్ ఇంజినీరు, అదనపు కమిషనరు, సూపరింటెండెంటు ఇంజినీరు, స్తపతి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు, రాజరాజేశ్వరస్వామి ఆలయ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు, కొండగట్టు ఆలయ కార్యనిర్వహణ అధికారి, ఆలయ ప్రధాన అర్చకులు సభ్యులుగా ఉన్నారు. కొండపైన ప్రధాన సమస్యలు దాదాపు 22 ఎకరాల విస్తీర్ణంలోని అంజన్న ఆలయ పరిసరాల్లో భక్తుల కోసం దాదాపు 70 గదులు, మూడు డార్మిటరీ షెడ్లు, మూడు గెస్ట్‌హౌజ్‌లు ఉన్నాయి. అంజన్న ఆలయం వెనుకవైపున భేతాళుడి గుడి, ఆలయానికి వెళ్లే దారి పక్కన రామాలయం ఉన్నాయి. కొండపైన వాహనాలు నిలిపేందుకు సరైన ప్రదేశంలేదు. ధర్మశాల గదుల్లో నీటి వసతి, సౌకర్యాలు అంతంతమాత్రంగానే ఉన్నాయి. దీక్షాపరులు మాల విరమణ చేయడానికి రూ.2.5 కోట్లతో ఆరేళ్ల కిందట మాల విరమణ మండప నిర్మాణానికి శంకుస్థాపన చేసినప్పటికీ పనులు పునాదుల స్థాయిలోనే నిలిచిపోవడంతో పిల్లర్ల కోసం వేసిన ఇనుము తుప్పు పడుతోంది. స్వామివారి దర్శనం కోసం నిత్యం వేలాది మంది భక్తులు తరలివచ్చి ఒక్క రోజు ఆలయ సన్నిధిలో బస చేయడానికి గదులు లభించక ఆరుబయటే సేదతీరి వెళ్తుంటారు. ఆలయ పరిసరాల్లో మరుగుదొడ్లు, మూత్రశాలలు ఉన్నప్పటికీ నిర్వహణ సరిగాలేక ఆలయ పరిసరాలు దుర్గంధంగా మారుతున్నాయి. అంజన్న పేరిట దాదాపు 650 ఎకరాల భూములు ఉన్నప్పటికీ గదుల నిర్మాణం, పార్కింగు సమస్య తీరడంలేదు. తాగునీరు, పుష్కరిణలోకి నిరంతర నీటి సరఫరాకు చర్యలు తీసుకోవాల్సి ఉంది. భక్తుల కోసం కనీసం 200 గదులు, డార్మిటరీ షెడ్ల నిర్మాణం చేపట్టాల్సి ఉంది. ఆరేళ్ల కిందట శంకుస్థాపన చేసిన మెట్లదారి నిర్మాణం ఊసేలేదు. శిథిలావస్థలో ఉన్న రామాలయం నిర్మించాల్సి ఉంది. ఏజెన్సీ ద్వారా పనులు ఆలయ పరిసరాల్లో బృహత్‌ప్రణాళిక అమలుకు 8 మంది సభ్యులతో జనవరిలోనే మాస్టర్‌ప్లాన్ కమిటీ ఏర్పాటైనప్పటికీ ఎలాంటి కదలిక కనిపించలేదు. శుక్రవారం మొదటిసారిగా దేవాదాయశాఖ ప్రధాన కార్యాలయంలో సమావేశమై 'ఈ ప్రొక్యూర్‌మెంటు' ద్వారా బృహత్ ప్రణాళిక అమలుకు ప్రత్యేక ఏజెన్సీని గుర్తించడానికి నిర్ణయించినట్లు అధికారులు వెల్లడించారు. కమిటీ సభ్యుల సూచనల మేరకు కొండపైన చేపట్టాల్సిన అభివృద్ధి పనులను గుర్తించి ఏజెన్సీ ద్వారా పూర్తి చేయనున్నట్లు ఈవో రామకృష్ణారావు తెలిపారు.

## వంట నూనెలు భగభగ

**భగత్‌నగర్ –నవభూమి:** కరీంనగర్‌లో సాయంత్రం మూసివేసిన నూనె విక్రయ దుకాణం కేంద్ర ప్రభుత్వం వంట నూనెలపై 20 శాతం సుంకం విధిస్తూ నిర్ణయం తీసుకోవడంతో విపణిలో ధరలు మండిపోయాయి. ఇప్పటికే నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటడంతో ఇబ్బందిపడుతున్న సామాన్యులు కేంద్ర నిర్ణయంతో మూలిగే నక్కపై తాటిపండు పడ్డ చందంగా మారింది. ఇదే అదనుగా భావించిన నూనె హెూల్‌సేల్ వ్యాపారులు తమ దగ్గర ఉన్న నిల్వలను బ్లాక్ చేశారని ఆరోపణలున్నాయి. ఉదయం దుకాణాలను తెరిచి మధ్యాహ్నానికే మూసేయడమే ఇందుకు నిదర్శనం. విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్న పొద్దుతిరుగుడు, పామాయిల్ నూనెలపై కేంద్రం సుంకం పెంచుతూ నిర్ణయం తీసుకొంది. ఇప్పటి వరకు బహిరంగ మార్కెట్‌లో లీటరుకు రూ.110 అమ్మిన పొద్దుతిరుగుడు పువ్వు నూనెను ఒక్కసారిగా రూ.140కు పెంచేశారు. రూ.90 ఉన్న పామాయిల్‌ను రూ.120కు పెంచి విక్రయించారు. ఇదే సమయంలో తగిన నిల్వలు లేవంటూ వినియోగదారులకు మొండిచెయ్యి చూపడంతో వారు ఎక్కువ ధరపెట్టి కొనుగోలు చేయాల్సి వచ్చింది. ప్రజలపై భారం..జిల్లా కేంద్రంలోని ప్రకాశంగంజ్ కేంద్రంగా నిత్యం పొద్దు తిరుగుడు పువ్వు 2000 కాటన్లు, పామాయిలు 3000 కాటన్లు, 500 గ్రాముల ప్యాకెట్లు 500 కాటన్లు, 15 కిలోల బరువున్న నూనె డబ్బాలు 1000 వరకు విక్రయిస్తారు. ఒక్కో కాటన్‌లో లీటర్ బరువున్న 16 ప్యాకెట్లు ఉంటాయి. ఈ లెక్కన ఒక్కో ప్యాకెట్‌పై రూ.30 పెంచినా.. పొద్దుతిరుగుడు నూనెపై రూ.9,60,000, పామాయిల్‌పై రూ.14,40,000 అదనపు భారం పడుతోంది.

# విలువలు పాటిద్దాం..
# భక్తితో సాగనంపుదాం..

**సిరిసిల్ల –నవభూమి:** గణేశ్ నవరాత్రి ఉత్సవాలు అంబరాన్నంటుతున్నాయి. వేములవాడ, సిరిసిల్ల పట్టణాలతోపాటు 255 గ్రామ పంచాయతీల్లో వివిధ రూపాల్లో కొలువుదీరిన గణనాథులను జిల్లావాసులు భక్తిశ్రద్ధలతో కొలిచారు. పోలీసుల పోర్టర్‌లో 2,194 వినాయకుల ప్రతిమలకు జియోట్యాగ్ పూర్తి కాగా, చిన్నచిన్నవి కలిపితే మూడు వేలకు పైగానే ఉంటాయి. తొమ్మిది రోజులు పూజలందుకున్న విఘ్నేశ్వరుడిని గంగమ్మ ఒడికి సాగనంపే సమయం దగ్గరపడింది. ఆదివారం నుంచి స్వామివారి నిమజ్జనానికి సంబంధించి శోభాయాత్రలు ప్రారంభమవ్వనున్నాయి. అవిఘ్నాలు కలగకుండా ముందు జాగ్రత్తలు పాటిస్తూ పార్వతి తనయుడి నిమజ్జన వేడుకలు పూర్తిచేయాల్సిన బాధ్యత అందరిపై ఉంది. ప్రధాన సమస్యలివి..పట్టణాల్లో వినాయక ప్రతిమల నిమజ్జనానికి క్రేన్‌లు ఏర్పాటు చేస్తారు కానీ.. పల్లెల్లో అలాంటి ఏర్పాట్లు కనిపించవు. భారీ గణనాథులను చేతులపై ఎత్తుకెళ్లి చెరువుల్లో నిమజ్జనం చేస్తుంటారు. వెళ్లే దారులు గుంతలతో అధ్వానంగా దర్శనమిస్తుంటాయి. చెరువుల వద్ద విద్యుత్తు వెలుగులు ఉండవు. చీకట్లోనే నిమజ్జనం చేయాల్సి ఉంటుంది. కనీసం లోతు తెలిసే విధంగా సూచికలు కనిపించవు. శోభాయాత్ర జరిగే వీధుల్లో రోడ్లపై గుంతలు, ఒక్కో చోట చిమ్మచీకట్లు ఉంటాయి. ముందురోజు చెట్లకొమ్మలు తొలగించి, వదులుగా ఉన్న తీగలను సరిచేసిన దాఖలాలు కనిపించవు. విగ్రహం తీసే సమయంలో..పట్టణ ప్రాంతాల్లో భారీ గణనాథులను మండపాల నుంచి తీసి రథాన్ని ఎక్కించేందుకు క్రేన్‌లను వినియోగిస్తున్నారు కానీ.. పల్లెల్లో అలాంటి సౌకర్యం లేకపోవడంతో భారీ వినాయకులను సైతం స్థానికులు ఎలాంటి యంత్రసాయం లేకుండా వాహనంలోకి ఎక్కిస్తుంటారు. ఆ సమయంలో పట్టు తప్పితే ప్రమాదం ఏర్పడే ఆస్కారం ఉంది. ఖర్చుకు వెనకాడకుండా యంత్రాల సాయంతో వాహనంలోకి ఎక్కించాలి. ఆ సమయంలో చిన్న పిల్లలు ప్రతిమల ఆవరణలో ఉండకుండా చూసుకోవాలి. కచ్చితంగా ప్రథమ



చికిత్స కిట్టు అందుబాటులో ఉంచుకోవాలి. శోభాయాత్రలో..నిమజ్జనానికి ముందే విగ్రహం ఎత్తు.. శోభాయాత్ర కొనసాగే ప్రాంతాన్ని పరిశీలించి చెట్లకొమ్మలు, విద్యుత్తు తీగలను చూసుకోవాలి. శోభాయాత్ర కొనసాగే క్రమంలో విగ్రహంపై ఎక్కి కనిపిస్తుంటారు. అడ్డుగా ఉన్న చెట్లకొమ్మలను, విద్యుత్తు తీగలను చేతులతో తొలగిస్తుంటారు. అలాంటి పనులు ఏ మాత్రం సురక్షితం కాదు. ముందురోజే అడ్డుగా ఉన్న చెట్లకొమ్మలను తొలగించమని పంచాయతీ, మున్సిపాలిటీ సిబ్బందికి తెలియజేయాలి. పెద్ద కర్రతో విద్యుత్తు తీగలను తొలగించేలా చూడాలి. నియంత్రికలకు సరఫరా అయ్యే విద్యుత్తు తీగలయితే సెస్ సిబ్బందికి సమాచారం ఇవ్వాలి. గుంతలు ఉన్న రోడ్లపై నెమ్మదిగా వెళ్లాలి. విన్యాసాలు వద్దు సుమీ..స్వామివారిని సాగనంపే క్రమంలో యువత ఎట్టి పరిస్థితుల్లో మద్యం తీసుకోకుండా నిర్వాహకులు జాగ్రత్తపడాలి. భారీ శబ్దాలు వచ్చేలా డీజేలను ఏర్పాటు చేయకూడదు. భక్తి పాటలకు సంప్రదాయ నృత్యాలు చేయాలి. వాహనాలు, డీజేలపై ఎక్కి విన్యాసాలు చేయకుండా చూడాలి. డీజేలకు దగ్గరగా ఉంటే గుండె లయ తప్పే అవకాశాలు ఉంటాయి. పిల్లలు జాగ్రత్త..శోభాయాత్రలో చిన్న పిల్లలు వాహనానికి దగ్గరగా ఉండకుండా చూడాలి. ట్రాక్టర్ ఇంజిన్, ట్రాలీకి మధ్యలో నిలబడకుండా జాగ్రత్తపడాలి. వాహనం ముందుకు కదిలే, వెనక్కి వచ్చే సమయంలో తప్పనిసరిగా పరిసరాలు పరిశీలించాలి. ప్రసాదాలు పంచేందుకు పిల్లలను ట్రాలీలో ఎక్కించవద్దు. కుదుపులకు కిందపడే ప్రమాదం ఉంటుంది. నీటి వనరుల వద్ద..ఇటీవల కురిసిన వర్షాలకు జిల్లాలోని వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయి. వంతెనలపై నుంచి చిన్న చిన్న విగ్రహాలు వేస్తే పెద్ద ప్రమాదం ఉండదు. భారీ వినాయకులను వేస్తే ప్రతిమలతోపాటు నీటిలో పడే ప్రమాదం ఉంటుంది. చెరువులో ఈత వచ్చిన వాళ్లే ప్రతిమను నిమజ్జనం చేసేందుకు వెళ్లాలి. లోతు అంచనా వేయకుండా నీటిలో దిగకూడదు. ఏదైన అత్యవసర అవసరం ఏర్పడితే 100, 108 నంబర్లకు సమాచారం ఇవ్వాలి.

# జిల్లాలో గ్రామీణ
# ఓటర్లు 4,08,058

**పెద్దపల్లి –నవభూమి:** ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో గత కొద్ది రోజులుగా పంచాయతీ అధికారులు వార్డుల వారీగా ఓటరు జాబితా వడబోత చేపట్టి ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేశారు. జిల్లాలో 4,08,58 మంది గ్రామీణ ఓటర్లుగా నమోదయ్యారు. ఇందులో 2,01,164 పురుషులు, 2,06,881 మహిళలు, 13 మంది ఇతరులుగా తేలారు. స్థానిక సంస్థల ఎన్నికల కోసం ఈనెల 21 వరకు ఓటరు జాబితాపై అభ్యంతరాలు స్వీకరిస్తున్నారు. ఆయా అంశాలపై గ్రామ పంచాయతీ కార్యదర్శులకు ఫిర్యాదు చేయవచ్చని అధికారులు పేర్కొంటున్నారు. మహిళలే అధికం జిల్లాలో పల్లె ఓటర్లలో మహిళలే పైచేయిగా నిలిచారు. జిల్లా మొత్తం ఓటర్లలో 49.30 శాతం పురుషులు, 50.70 శాతం మహిళలుగా నమోదయ్యారు. ముసాయిదా ఓటరు జాబితాపై ఈనెల 18న జిల్లా స్థాయిలో కలెక్టర్, 19న మండల స్థాయిలో ఎంపీడీవోలు రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహిస్తారు. ఈనెల 26లోపు అభ్యంతరాలను పరిశీలించనున్నారు. 28న తుది ఓటరు జాబితా విడుదల చేయనున్నారు.

